క్లుప్తంగా

29న తైబజార్ వేలం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో 2025– 26 సంవత్సరానికి సంబంధించి తైబజార్ రుసుం వసూలు చేసుకునే కాంట్రాక్ట్ కోసం వేలం పాట నిర్వహించనున్నట్లు కమిషనర్ బి.వెంకట్రామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.1 లక్ష డీడీని కమిషనర్ పేరిట తీసి, 29వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్న వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

108 వాహనంలో ప్రసవం



వాహనంలో పసికందుకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మహేశ్వరం: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ నిండు గర్భిణి 108 వాహనంలో శుక్రవారం ప్రసవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి తుక్కుగూడ ఫ్యాబ్ సిటీలో నివాసం ఉండే జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బాబితా దేవి నెలలు నిండి ప్రసవవేదనతో బాధపడుతోంది. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. అనంతరం వాహనంలో పైలెట్, నర్సు.. బాధితురాలిని మహేశ్వరం మండల కేంద్రం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో వారు ఆమెకు ప్రథమ చికిత్స అందించగా.. పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం మహేశ్వరం ధర్మాసుపత్రిలో తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. 108 ఈఎంటీ రామచంద్రయ్య, పైలెట్ గణేశ్‌లను వైద్యులు, బాబితాదేవి బంధువులు అభినందించారు.

నేడు డయల్ యువర్ డీఎం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 ఆర్టీసీ డిపో నుంచి నడిచే బస్సులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, సమస్యలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఉద్గిర్, బీదర్‌కుంద్, జూకల్, కొల్హాపూర్, విజయవాడ, బైలడిల్లా, జగదల్‌పూర్, బెంగళూరు, తొర్రూర్ వెళ్లే బస్సులు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రయాణికులు నేరుగా డీఎంతో మాట్లాడవచ్చన్నారు. ఎలాంటి సమస్యలున్నా 9959226249 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు విస్తృతస్థాయి సమావేశం

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సాగర్ రింగ్‌రోడ్ చౌరస్తా సమీపంలోని వన్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ ప్రచారం కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తెలిపారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జిల్లా పరిశీలకులు శివసేనారెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన వార్షికోత్సవ పూజలు



పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

వనస్థలిపురం: వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి సమీపంలోని ఎల్లమ్మదేవి ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎల్లమ్మదేవి నవఏకాదశ (20వ) వార్షికోత్సవ పూజలు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా దేవతారాధన, జమదగ్ని సమేత రేణుకా ఎల్లమ్మదేవి కళ్యాణోత్సవం, అన్న సమారాధన, ఆశీర్వచనం, ద్వాదశ హారతి, ఉయ్యాల సేవ, తీర్థ గోష్ఠి, ఉత్సవ సమాప్తి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షుడు మాలె రాంరెడ్డి, ప్రధాన అర్చకులు కే.లింగమూర్తిశర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోడింగ్, కంప్యూటర్ కోర్సుపై ఉచిత శిక్షణ

చాదర్‌ఘాట్: మురికివాడలో నివసించే పేద విద్యార్థులకు 10వ తరగతి పాసై చదువుకోలేని స్థితిలో ఉన్న వారికి ఉచితంగా మెడికల్ కోడింగ్, కంప్యూటర్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు అప్సా సంస్థ ప్రాజెక్ట్ అధికారి బసవరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18–27 సంవత్సరాల వయసు గల వారికి మూడు నెలలు శిక్షణ ఉంటుందని డిగ్రీ చేసి ఉండాలన్నారు. కంప్యూటర్ కోర్స్ కోసం ముషీరాబాద్ చౌరస్తాలోని కార్యాలయానికి అదే విధంగా మెడికల్ కోడింగ్ శిక్షణ కోసం హబ్సిగూడ చౌరస్తా కార్యాలయానికి రావాలని మరిన్ని వివరాలకు 9912944967 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సిగ్నల్స్ లేక.. ముందుకు సాగక

వాహనదారుల ఇక్కట్లు..
- సరూర్‌నగర్ కూడలిలో ట్రాఫిక్ కష్టాలు
- పోలీసుల పర్యవేక్షణ శూన్యం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



పోస్టాఫీసు చౌరస్తాలో ట్రాఫిక్ జాం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ పోస్టాఫీసు చౌరస్తా ట్రాఫిక్‌కు నిలయంగా మారింది. ప్రధాన కూడలి కావడంతో ఈ మార్గం గుండా నిత్యం వేలాది వాహ నాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు ఇరుకుగా ఉండటం, ఆపై రహదారికి ఇరువైపులా ఆటోల పా ర్కింగ్‌తో పాటు.. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ లేక, ట్రా ఫిక్ పోలీసుల పర్యవేక్షణ కొరవడి వాహన చోద కు లు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పద్మవ్యూహం నుంచి బయటపడేందుకు చెమటోడుస్తున్నారు. అయినప్పటికీ.. పలువురు వాహనదారులు ఇష్టానుసారంగా దూసుకెళ్తూ ఇతర వాహనదారులను, ప్రజలను భాయందోళనకు గురిచేస్తున్నారు.

అడ్డదిడ్డంగా పరుగు

అసలే ఇరుకు దారి. ఆపై నియంత్రణ లేకపోవడంతో వాహనాలు అడ్డదిడ్డంగా పరుగులు తీస్తున్నాయి. పలువురు వాహనదారులు మితిమీరిన వేగంతో దూసుకుపోతున్నారని, దీని వలన ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

ఎల్‌బీనగర్, కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్, కర్మన్‌ఘాట్ వెళ్లాలంటే ఈ కూడలే ప్రధాన మార్గం. నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఇక్కడ ట్రాఫిక్ స్తంభించిపోతుంటుంది. ఫలితంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, చౌరస్తాతో పాటు ప్రధాన మార్గంలోనూ ట్రాఫిక్ సిగ్నల్స్, పోలీసులను ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డు విస్తరణ చేపట్టాలని జోనల్‌కమిషనర్‌కు లేఖ అందిస్తున్న కార్పొరేటర్లు శ్రీవాణి, రాజశేఖర్

విస్తరణ పనులు చేపట్టాలి

కూడలి రోడ్డు ఇరుకుగా ఉండటం, ఆపై సిగ్నల్ వ్యవస్థ లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా దూసుకెళ్తున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి.. చౌరస్తా విస్తరణతో పాటు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలి



– జుబేర్, సరూర్‌నగర్

మాస్టర్ ప్లాన్‌లో వంద ఫీట్ల రోడ్డు

హైదరాబాద్– విజయవాడ హైవే మాస్టర్ ప్లాన్‌లో వంద అడుగుల రోడ్డు. ఈ రహదారికి సీఎం రోడ్డు అని పేరుంది. రోడ్డు విస్తరణ చేపట్టాలని అధికారులకు పలుమార్లు విన్నవించాం. అయినా ప్రయోజనం లేదు. లింగోజిగూడ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి జోనల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశాం. ప్రజల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి. చౌరస్తాలో సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి.

– ఆకుల శ్రీవాణి, కార్పొరేటర్, సరూర్‌నగర్



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గాయత్రీనగర్ బ్యాంకు కాలనీ సబ్ స్టేషన్ నుంచి గాయత్రీనగర్ పేజ్–2 వరకు నిర్మించే సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కాలనీల్లో జరుగుతున్న పనుల్లో స్థానికులు భాగస్వాములైతే సకాలంలో పూర్తవుతాయన్నారు. సమస్యలు లేని కాలనీలుగా తీర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఏఈ రాజ్‌కుమార్, కాలనీవాసులు భవానీ, రాంబాబు, ఉపేందర్ పాల్గొన్నారు.

ఇళ్ల విషయమై ఆందోళన చెందొద్దు



కాలనీలవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: తమ ఇళ్ల విషయమై కమలానగర్, ఆంధ్రకేసరినగర్, పరిసర కాలనీల ప్రజలు ఎలాంటి ఆందోళనలకు గురి కావద్దని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్, ఆంధ్రకేసరినగర్, పరిసర కాలనీలవాసులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిశారు. గత 40 ఏళ్లుగా ఆయా కాలనీల్లో తాము ఇళ్లు కట్టుకుని నివాసముంటున్నామని ఇటీవల ఓ వ్యక్తి కాలనీలకు చెందిన స్థలాలు నావే అంటూ ఆర్‌డీఓ కార్యాలయంలో కేసు వేయగా దానిపై ఆర్‌డీఓ స్టేటస్‌కో ఇచ్చారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై తాము ఆర్‌డీఓను ప్రశ్నిస్తే మరోసారి పరిశీలిస్తామని చెప్పారని అన్నారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే ఆర్‌డీఓకు ఫోన్ చేసి కాలనీల ప్రజలు ప్రభుత్వ అనుమతులు, బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని ఇళ్లు కట్టుకున్నారని, ఎలాంటి కబ్జాలకు పాల్పడలేదని తెలిపారు. ఎవరో మిమ్మల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆర్‌డీఓకు వివరించారు. కాలనీలలో పర్యటించి తగిన న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

రోడ్డుకు చిల్లులు.. జేబుల్లోకి బిల్లులు?



కాంట్రాక్టర్ రహదారి వేసాడని చెబుతున్న సింగరేణి కాలనీ రోడ్డు ఇదే

- రోడ్డు వేయకుండానే బిల్లుల చెల్లింపు
- అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కుతో ప్రజాధనం వృథా
- చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ ఫిర్యాదు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో జీహెచ్ఎంసీ అధికారుల అవినీతి పరాకాష్టకు చేరింది. అభివృద్ధి పనులు పూర్తి కాకుండానే అందుకు సంబంధించిన బిల్లులను కాంట్రాక్టర్‌కు చెల్లించేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై లక్షలాది ప్రజాధనం జేబుల్లోకి వెళ్తుంది. సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల వద్ద సీసీ రహదారులు నిర్మించే పనుల్లో భాగంగా సుమారు రూ. 10 లక్షలను ఎలాంటి పనులు చేయకుండానే కాంట్రాక్టర్‌కు అధికారులు చెల్లింపులు చేసారని ఏకంగా డివిజన్ కార్పొరేటరే ఆరోపిస్తుండటం సంచలనంగా మారింది. ఈ మేరకు కార్పొరేటర్ పూర్తి ఆధారాలతో శుక్రవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కలిసి ఫిర్యాదు చేసారు. అవినీతికి పాల్పడిన అందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పనుల వివరాలివీ..

◆ గతేడాది గణేష్ నిమజ్జన ఉత్సవాలు పురస్కరించుకొని ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల వద్ద సీసీ రహదారి నిర్మించడానికి అధికారులు ప్రతిపాదనలు చేసారు.

◆ అందుకు సంబంధించి కేటాయించబడిన వర్క్ ఐడీ:24041451, టెండర్ ఐడీ:539228కి 24–08–2024న అనుమతి మంజూరైంది.

◆ సదరు కాంట్రాక్ట్‌ను ప్రాజెక్ట్ నేమ్ మెన్షన్‌గా రూ. 9.90 లక్షలకు ఖాన్ కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులను దక్కించుకుంది.

◆ అయితే గత సంవత్సరం గణేష్ నిమజ్జన ఉత్సవాలు పూర్తయ్యాయి. కానీ సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల వద్ద రహదారుల పరిస్థితి ఏ మాత్రం మారలేదు.

◆ కాంట్రాక్ట్ విషయమై అధికారులు, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లును కొంత మేరనో, మొత్తంగానో చెల్లింపులు చేశారని కార్పొరేటర్ ఆరోపిస్తున్నారు.

◆ ఏది ఏమైనా జీహెచ్‌ఎంసీ అధికారుల అవినీతి విషయమై డివిజన్ కార్పొరేటరే ఆరోపిస్తున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి ఈ విషయమై తగిన విచారణ చేయించి కఠిన చర్యలు తీసుకోవాలని డివిజన్ వాసులు కోరుతున్నారు.



విచారణ జరపాలి

ఐఎస్‌సదన్ డివిజన్ వాసుల సమస్యల పరిష్కారానికి నిత్యం వారితో మమేకమై పనిచేస్తున్నా. సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల వద్ద రహదారి నిర్మాణ విషయమై జరిగిన అవినీతిపై నిష్పక్షపాత విచారణ జరిపితే నిజాల నిగ్గు తేలుతుంది. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటే మరోమారు అలాంటి తప్పు జరగదు.

–జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, కార్పొరేటర్

పైపులైన్ లేని ప్రాంతంలో డ్రైనేజీ పనులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని భూగర్భడ్రైనేజీ పనులను చేంజ్ ఆఫ్ సైట్ భాగంగా పైపులైన్ లేని చోట గతంలో మంజూరైన పనులను ఇతర ప్రాంతాలకు మార్చామని జలమండలి మేనేజర్ సిరివెన్నెల తెలిపారు. ఎస్‌కేడీనగర్ మొయిన్ రోడ్డు వద్ద వేసే పైపులైన్ ఇతర కాలనీలకు మార్చినట్లు వస్తున్న ఆరోపణలు నిజం లేదన్నారు. హైయర్ దయా పైప్‌లైన్ వేసేందుకు పైపులు లేకపోవడంతో పనులు నిలిపేశామని తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్ శివాలయం పక్కన ఉన్న డ్రైనేజీ పైపులైన్ లెవల్స్ సరిగా లేకపోవడంతో తరుచూ డ్రైనేజీ పొంగుతుందన్నారు. పైపులైన్ కూడా ఇంటి నిర్మాణం కింద ఉండడంతో డ్రైనేజీని శుభ్రం చేయడం కష్టంగా ఉందని దీనిని దృష్టిలో పెట్టుకుని అక్కడ ఉన్న పైపులైన్‌ను మార్చి రీమోడలింగ్ చేస్తున్నామన్నారు.



మహేశ్వరం: అమీర్‌పేట్‌లో నిర్మాణ పనులు ప్రారంభించిన జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి



పహాడీషరీఫ్: లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న నవీన్ గౌడ్



కందుకూరు: కొత్తగూడలో భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ తదితరులు

పేద ప్రజలకు అభయ 'హస్తం'

- కాంగ్రెస్ అంటేనే.. భరోసా
- మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం
- మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు
- లబ్ధిదారులకు 'ఇందిరమ్మ' మంజూరు పత్రాల అందజేత



మహేశ్వరం: ఘట్టుపల్లిలో నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ అంటేనే భరోసా. పేద ప్రజలకు అభయ హస్తం అని మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొరుపోలు రఘుమారెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి, సొంతింటి కల నెరవేరుస్తుందని పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధి ఘట్టుపల్లి గ్రామంలో 15 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి మంజూరు పత్రాలు అందజేశారు. ఇంటి నిర్మాణాలకు ముగ్గుపోశారు. మార్కింగ్ ఇచ్చి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలను న్యాయం జరుగుతుందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు, బీసీ, ఓసీలకు రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందించనుందని తెలిపారు. దివంగత నేత, మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. డబుల్ బెడ్ రూం పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిరీషరెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జంగయ్య, మల్లప్ప, సాయిలమ్మ, పద్మమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సాబేర్, నాయకులు యాదగిరి, జంగయ్య, కుమార్, సంజీవ, రాజేందర్, స్వామి, రమేష్, రాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిచండమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. శుక్రవారం మహేశ్వరం మండలం అమీర్‌పేట్ గ్రామంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ ఇచ్చి, ముగ్గుపోశారు. పలువురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ హయాంలో పేద రైతులు సాగు చేసుకోవడానికి లావని పట్టా భూముల పంపిణీతో పాటు, ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటిని నిర్మించి ఇచ్చారని గుర్తుచేశారు. వైఎస్సార్ హయాంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మాణం చేసి, ఇంటి స్థలాలను పంపిణీ చేశారన్నారు. అమీర్‌పేట్ గ్రామంలో 87 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రఘుపతి, యాదయ్య, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి చంద్రమోహన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు రమేష్, భాస్కర్, రాజేందర్ ఈశ్వర్, కేజే.ప్రసాద్, నర్సింహ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎంపిక

పహాడీషరీఫ్: ఇచ్చిన మాటకు కట్టుబడి, ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఆ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ 17వ వార్డు ఇన్‌చార్జి చింతకింది నవీన్ గౌడ్ అన్నారు. శ్రీరామ కాలనీలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కంచె శ్రీకాంత్, వార్డు ఆఫీసర్ లోకేష్‌తో కలిసి శుక్రవారం మంజూరు పత్రాలు అందజేశారు. అర్హులను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నారని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే న్యాయం

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ మామిడిపల్లి నాయకులు లాల్ సతీష్ గౌడ్, నరేష్ గౌడ్‌లు అన్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు శుక్రవారం వారు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ విజయ్ గౌడ్, సభ్యులు రితికా, రాజు, మమత, పవన్‌కుమార్, మంఖాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుక్కుగూడ 9వ వార్డులో మార్కింగ్ చేశారు. నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు అధికారి విజయలక్ష్మి, నాయకులు, నాగిళ్ల శేఖర్, కమిటీ సభ్యులు మహేందర్, శ్రీధర్ పాల్గొన్నారు.

కల నెరవేరనుంది



దెబ్బడగూడలో భూమి పూజచేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు

కందుకూరు: ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కల నెరవేరనుందని మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి అన్నారు. శుక్రవారం మండల పరిధి దెబ్బడగూడలో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు ఎంపీడీఓ సరితతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నీలం వెంకటేశ్, ప్రభాకర్, యాదగిరి, వసంత, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ సులేమాన్, పీఏసీఎస్ డైరెక్టర్ టి.జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు వెంకట్ రెడ్డి, జంగయ్య, జగన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఎండీ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

మంజూరు పత్రాలు అందజేత

కందుకూరు: మండల పరిధి కొత్తగూడలో శుక్రవారం ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు 22 మందికి మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి, సీనియర్ నాయకుడు ఏ.సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండు రంగారెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సంజీవరెడ్డి, శేఖర్‌గౌడ్, ఎండీ ఖదీర్, హనుమంత్ రెడ్డి, కె.కృష్ణ, దేవేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: మంజూరు పత్రాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు



పహాడీషరీఫ్: మామిడిపల్లిలో..